

సృజనాత్మకత పెంపొందుతుంది

సైన్స్ ఫెయిర్‌ల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. - 8లో



మట్టపల్లిలో నిత్య కల్యాణం

మట్టపల్లి దేవాలయంలో ఆదివారం నృసింహుడి నిత్య కల్యాణాన్ని అర్చకులు విశేషంగా నిర్వహించారు. - 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37°/19°

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



సూర్యాపేటలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : తెలంగాణ సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీలకు సంబంధించి డిగ్రీలో ప్రవేశం పొందేందుకు ఆదివారం ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. సూర్యాపేటలో రెండు సెంటర్లలో 950 మంది విద్యార్థులకు గాను 886 మంది విద్యార్థులు హాజరు కాగా 64 మంది గైర్హాజరయ్యారు. అలాగే నల్లగొండలో మూడు సెంటర్లలో 1515 మంది విద్యార్థులకు గాను 1393 మంది, యాదాద్రిభువనగిరి జిల్లాలో ఒక సెంటర్‌లో 400 మంది విద్యార్థులకు గాను 359 మంది హాజరైనట్లు ఆర్‌సీవో అరుణకుమారి తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



తిరుమలగిరి : సైకిల్ ర్యాలీలో పాల్గొన్న జిల్లా వైద్యాధికారి కోటాచలం

తిరుమలగిరి (తుంగతుర్తి) : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా వైద్యాధికారి కోటాచలం కోరారు. ఆదివారం తిరుమలగిరిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా, వ్యాయామం, నడక, ధ్యానం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, సీహెచ్‌ఓ బిచ్చునాయక్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు రామచంద్రు గౌడ్, కార్యదర్శి ఐతె శ్రీనివాస్, నాని పాల్గొన్నారు.

సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) 7వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లో ఈ నెల 10న నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కన్వీనర్ కొత్తపల్లి శివ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రవన్న విద్యార్థి దశ నుండి పీడిత, తాడిత ప్రజల కోసం 45 సంవత్సరాలు అజ్ఞాతంలో ఉండి ఉద్యమాలు నడిపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, నాయకులు ఎర్ర అఖిల్ కుమార్, భూక్యా రాంజీ, బుల్లెట్ వెంకన్న, రమేష్, వాజీద్, జీవన్, పద్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డులో సభ్యులుగా చేరాలి



మాట్లాడుతున్న జడ శ్రీనివాస్

హుజూర్‌నగర్ : ప్రతి కార్మికుడు సంక్షేమ బోర్డులో సభ్యుడిగా చేరాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జెట్టి ప్రసాద్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గోవిందపురంలో ఆదివారం నిర్వహించిన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నో పోరాటాల ద్వారా కార్మికులకు సంక్షేమ బోర్డును సాధించుకున్నట్లు పేర్కొన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. అర్హులైన ప్రతి కార్మికునికి ఇల్లు , రేషన్ కార్డు ఇవ్వాలని వారు కోరారు. అనంతరం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ పట్టణ నూతన అధ్యక్షుడిగా ముడుసు పాపారావును ఎన్నుకున్నారు. సమావేశంలో పాలడుగు రాజు, బొప్పన రాజు, బండి భాస్కర్, చిలకబత్తిని జయరాజు, తాటికొండ జయరాజు, ఎస్‌జీఆర్, శాంతయ్య, ఎం వెంకటేశ్వర్లు, సీహెచ్ సామేలు, బెనర్జీ, యేసుపాదం పాల్గొన్నారు.

పదిలో పట్టు సాధించేలా..

- విద్యార్థులకు అభ్యాస దీపికల పంపిణీ
- ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదం
- పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 7,535 మంది



సూర్యాపేట నుంచి అభ్యాస దీపికలు తీసుకెళ్తున్న ఎంఈఓలు, హెచ్‌ఎంలు (ఫైల్)

సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రీ ఫైనల్ పరీక్షల ఫలితాల ఆధారంగా పాఠ్యాంశాల వారీగా వెనకబడిన విద్యార్థులు మరింత పట్టు సాధించేలా ప్రణాళికను తయారు చేస్తోంది. దీనిలో భాగంగానే విద్యాశాఖ అధికారులు ఈ విద్యా సంవత్సరం గణితం, సామాన్య, సాంఘిక, భౌతిక, జీవశాస్త్రాలకు ప్రత్యేకంగా అభ్యాస పుస్తకాలను అందిస్తున్నారు. దీని కోసం జిల్లాలోని ప్రభుత్వ, కేజీబీవీ, మోడల్ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 5వేల మంది విద్యార్థులకు వీటిని ఇవ్వనున్నారు. వీటిని లఘు, వ్యాసరూప, బహుళ ఐచ్ఛిక ప్రశ్నలకు జవాబులతో రూపొందించారు.

ఆరు పేపర్లతోనే...

కరోనాతో పదో తరగతి పరీక్షలు వరుసగా రెండేళ్లు రద్దయ్యాయి. అంతర్గత మూల్యాంకనం ఆధారంగా గ్రేడులు ఇచ్చారు. 2021–22 విద్యా సంవత్సరం మాత్రం 11 పేపర్లతో పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం ఆరు పాఠ్యాంశాలను ఆరు పేపర్లుగా నిర్ణయించారు. దీంతో విద్యార్థులు అయోమయానికి గురికావాల్సిన పరిస్థితి. 11పేపర్లలో పాఠ్యంశాన్ని విభజించి చదువుకునే వారు. ఒక పేపరులో తక్కువ మార్కులు వచ్చినా నిరాశ చెందకుండా పట్టుదలతో చదివి మరో దానిలో ఎక్కువ మార్కులు తెచ్చుకునే వీలుండేది. ఇలా మొత్తం గ్రేడ్‌లు సాధించేందుకు అవకాశం ఉండేది. ప్రస్తుతం మొత్తం పాఠ్యాంశం ఒకే పేపరుగా ఉంటుంది. దీనిలో ప్రశ్నల విధానం ఎలా ఉంటుంది.. ఏ విభాగంలోని ప్రశ్నలకు సమాధానాలు నిడివితో రాయాలని నిత్యం విద్యార్థుల మదిలో ఆలోచనలు తొలిస్తున్నాయి. వీటన్నింటికీ పరిష్కారం చూపుతూ అభ్యాస దీపికల పంపిణీకి శ్రీకారం చుట్టారు.

విద్యార్థులకు పంపిణీ

జిల్లాలో ప్రభుత్వ ఉన్నత, కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో 7,535 మంది విద్యార్థులు పదో తరగతి విద్యనభ్యసిస్తున్నారు. అయితే వీరికి సోషల్, బయో సైన్స్, ఫిజికల్ సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులకు సంబంధించి విద్యార్థులకు అభ్యాస దీపిక(స్టడీ మెటీరియల్స్)లు పంపిణీ చేస్తున్నారు. అయితే మొత్తం 30140 అభ్యస దీపికలు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 25,084 అభ్యస దీపికలు వచ్చాయి. అయితే వీటిని ఇటీవల జిల్లా కేంద్రం నుంచి మండల విద్యావనరుల కేంద్రాలకు పంపిణీ చేశారు. ఆయా మండలాల ఎంఈఓలు, హెచ్‌ఎంలు అభ్యస దీపికలు తీసుకెళ్లారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు. కాగా భాషా పాఠ్యాంశాలకు సైతం అందజేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



పెన్‌పహాడ్ జెడ్పీ హెచ్ఎస్‌లో అభ్యాస దీపికలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయి



ప్రభుత్వం విద్యా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ఈ అభ్యాస దీపికలు ఉపయోగపడతాయి. విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గుతుంది. అభ్యాస దీపికలతో నూతన పరీక్ష విధానంపై విద్యార్థుల్లో నెలకొన్న భయాందోళన తొలుగుతుంది. వీటిని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఈ అభ్యాస దీపికలు పంపిణీ చేస్తున్నారు.

– అశోక్, డీఈఓ

బోడలదిన్నెలో ఐఎస్ఎస్ బృందం సర్వే



బోడలదిన్నె గ్రామంలో పర్యటిస్తున్న ఐఎస్ఎస్ బృందం

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలంలోని బోడలదిన్నె గ్రామంలో ఆదివారం ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీసెస్(ఐఎస్ఎస్) బృందం సర్వే నిర్వహించింది. వసుమాన పుంజి(ఢిల్లీ), సుజాత ఘోష్(పశ్చిమ బెంగాల్), రంజనాశైనీ(ఢిల్లీ), నిహారిక సింగ్(ఉత్తరప్రదేశ్), హిమాన్షిత్రివేది(ఉత్తర ప్రదేశ్) ఐదుగురు సభ్యుల బృందం సభ్యులు గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, మహిళా సంఘాల పనితీరును తెలుసుకున్నారు. వైద్యం అందుతున్న తీరు, ప్రభుత్వ పథకాలపై ఇంటింటికి వెళ్లి సర్వే చేశారు. వీరి వెంట ఎంపీపీ లకుమళ్ల జ్యోతి, జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, ఎంపీడీఓ శంకరయ్య, కార్యదర్శి వర్యాలతో కలిసి పర్యటించారు. అనంతరం గ్రామస్తులతో ఆ బృందం ముచ్చటించారు.

శాంతిభద్రతల పరిరక్షణలో విఫలం

- ప్రభుత్వ వైఖరిపై నేడు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిరసన దీక్ష
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వెల్లడి
- 'డబుల్' ఇళ్లపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

తిరుమలగిరి (తుంగతుర్తి) : తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. ఆదివారం తిరుమలగిరిలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో విఫలమైనందున సోమవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు నిరసన దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల సమస్య రాష్ట్రంలో అన్ని గ్రామాల్లో ఉందన్నారు. ఇప్పటి వరకు ఎన్ని ఇళ్లు నిర్మించారో, ఎంత మందికి ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద విడుదలైన నిధులు ఏమి చేశారో చెప్పాలన్నారు. ప్రస్తుతం కట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లోపించిందని ఆరోపించారు. సీఎం మాత్రం ప్రగతి భవన్‌లో 100 రూములు కట్టుకున్నాడని, సామాన్యులకు మాత్రం ఎవరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వలేదన్నారు. రైతులకు లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తామని ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రుణానికి మిత్తికి మిత్తి అవుతోందన్నారు. ప్రధాన మంత్రి కిసాన్ యోజన కింద రైతులకు ఇస్తున్న డబ్బులను బ్యాంకులే కట్ చేసుకుంటున్నాయని తెలిపారు. పేదల ద్రోహి రాష్ట్ర ముఖ్యమంత్రి అని విమర్శించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో పెద్ద కుంభకోణం జరిగిందని, దీనిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

'ధరణి'.. రైతులకు గుదిబండ

ధరణి పోర్టల్‌ను ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు ప్రభుత్వ భూములను కబ్జా చేయడానికి వాడుకుంటున్నారని ఆరోపించారు. ధరణి తెలంగాణ రైతులకు గుది బండగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు తొమ్మిదిసార్లు కరెంటు చార్జీలు, ఏడుసార్లు బస్ చార్జీలు, భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు, ఆస్తపన్ను, నీటి పన్నులు పెంచి పేదలపై భారం మోపుతోందని ఆరోపించారు. చివరకు లిక్కర్‌పై కూడా ధరలు పెంచారన్నారు. లిక్కర్ స్కాంలో ముఖ్యమంత్రి కుమార్తె కవిత ఉందని, బిడ్డను కాపాడుకోవడానికే సీఎం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తప్పు చేయకుంటే కోర్టు ద్వారా నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. లిక్కర్ స్కాంలో అరెస్ట్ అయిన ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి విడుదల కోసం లేఖలు రాస్తున్నారని ఆరోపించారు. సీఎం కూతురు కవిత లిక్కర్ స్కాంలో తప్పు చేసిందని తెలుసు కాబట్టే ముఖ్యమంత్రి గట్టిగా చెప్పలేక పోతున్నారన్నారు. ఎన్ని కుట్రలు చేసినా తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీలు బూర నర్సయ్య గౌడ్, రవీందర్ నాయక్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కడెం రామచంద్రయ్య, గోలి మధుసూదన్‌రెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వై.ధీన్‌దయాళ్, యాదగిరి,సాయిబాబా, శోభారాణి, పూలమ్మ, వెంకట్‌రెడ్డి, హన్మంతు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కలకోవలో మూడోసారి..

మత్స్య సహకార సంఘం ఎన్నికలు వాయిదా

- అనారోగ్య కారణాలతో ఎన్నికల అధికారి హాజరుకాకపోవడమే కారణం
- వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన కోదాడ ఆర్డీఓ కిశోర్‌కుమార్



కలకోవలో డీఎస్పీతో చర్చిస్తున్న కోదాడ ఆర్డీఓ

మునగాల(కోదాడ): మునగాల మండలం కలకోవ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు మూడోసా రి వాయిదా పడ్డాయి. హైకోర్టు ఆదేశాల మేరకు ఆదివారం ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా.. అనారోగ్య కారణాలతో ఎన్నికల అధికారి హాజరు కాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు కోదాడ ఆర్డీఓ కిశోర్‌కుమార్ ప్రకటించారు. ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్ పార్టీ, సీపీఎం పార్టీలకు చెందిన మద్దతుదారులు రంగంలో నిలిచారు. అయితే, గతంలో రెండుసార్లు సంఘం ఎన్నికలు వాయిదా పడడంతో సంఘం మాజీ అధ్యక్షుడు బుర్రి శ్రీరాములు హైకోర్టును ఆశ్రయించాడు. ఆదివారం ఎన్నికలు నిర్వహించాలని జిల్లా మత్స్య సహకార సంఘం అధికారికి హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. దీంతో మత్స్యశాఖకు చెందిన కమలాకర్‌ను ఎన్నికల అధికారిగా కేటాయించారు. సంఘంలో 40మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 36మంది తమ ఓటు వినియోగించుకొని పాలకవర్గాన్ని ఎన్నుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. ఎన్నికల సమయంలో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న దృష్ట్యా కోదాడ డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 120మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, సంబంధిత అధికారి అనారోగ్య సమస్యలతో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లడంతో సకాలంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించడంలో జాప్యం జరిగింది. దీంతో ఎన్నికల సహాయ అధికారి నాగేశ్వరరావు ఆర్డీఓకు సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే కలకోవకు చేరుకొని పరిస్థితిని కలెక్టర్‌కు విన్నవించి ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

అధికార పార్టీ ఒత్తిడితోనే..

అధికార పార్టీ నాయకుల ఒత్తిడితోనే మత్స్య పారిశ్రామిక సంఘం ఎన్నికలు వాయిదా పడ్డాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. అధికారి మద్యం సేవించి ఉన్నందున పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించామనే నెపంతో ఎన్నికలను వాయిదా వేయడం సమంజసం కాదన్నారు. హైకోర్టు ఉత్తర్వులను అధికారులు సక్రమంగా అమలుచేయకపోవడంతోనే మూడోసారి ఎన్నికలు వాయిదా పడ్డాయన్నారు. సమావేశంలో నాయకులు బుర్రి శ్రీరాములు, వెంకటేశ్వరరావు, శేఖర్, బచ్చలకూర స్వరాజ్యం, షేక్ సైదా, జూలకంటి విజయలక్ష్మి, వీరబోయిన వెంకన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో నిత్యారాధనలు ఆగమశాస్త్రం ప్రకారం చేపట్టారు. ఆదివారం వేకువజామున స్వామివారికి సుప్రభాతం, అనంతరం స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన, బాలభోగం, నిజాభిషేకం, సహస్రనామార్చన చేపట్టి తులసీ దళాలతో అర్చించారు. ప్రథమప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు జరిపించారు.

పిల్లల బాధ్యత తల్లిదండ్రులదే

- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : పిల్లల భవిష్యత్తు విషయంలో జరిగే మంచి చెడులకు పూర్తి బాధ్యత తల్లిదండ్రులదేనని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక పబ్లిక్ క్లబ్ ఆవరణలో గుడ్ పేరెంటింగ్ (పిల్లలను ఎలా పెంచాలి) కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు కష్టం విలువ తెలిసేలా పెంచితేనే జీవితంలో స్థిరపడాలన్న ఆలోచన వచ్చి వారి భవిష్యత్తు బాగుంటుందన్నారు. అంతకుముందు ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ఐఏఎస్, ఐపీఎస్ శిక్షకుడు రాఘవేంద్ర సదస్సుకు హాజరైన తల్లిదండ్రులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూర్యాపేట చైర్ పర్సన్ అన్నపూర్ణ, పబ్లిక్ క్లబ్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో వ్యక్తిత్వ వికాస బోధనా నిపుణుడు రాఘవేంద్ర

17నుంచి జనచైతన్య యాత్రలు : చెరుపల్లి

భువనగిరిటౌన్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు ఈనెల 17నుంచి 29వ తేదీ వరకు సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జన చైతన్య యాత్రలు నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్సీ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు తెలిపారు. భువనగిరిలోని సుందరయ్య భవన్‌లో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు ప్రత్యేక బృందాలు యాత్ర చేపడుతాయన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసర సరుకులతో పాటు ముడి చమురు, గ్యాస ధరలు ఎడాపెడా పెంచుతూ ప్రజలపై భారం మోపుతుందన్నారు. అంతేకాకుండా మత రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తుందని ఆరోపించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, నాయకులు నర్సింహ, బాలరాజు, మల్లేశం, నర్సింహులు, యాదగిరి, లింగారెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'మిషన్' గుంతలను పూడ్చండి

- కుక్కలు, కోతులు, పందుల బెడదను నివారించాలి
- సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు చేపట్టాలి
- తాగునీటి సమస్యను పరిష్కరించాలి
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో విన్నవించిన హుజూర్‌నగర్ పట్టణ ప్రజలు
- అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్న ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్

సాక్షి ఫోన్‌ఇన్

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లోని కాలనీల్లో నెలకొన్న కుక్కలు, కోతులు, పందుల బెడదను నివారించాలని పట్టణ ప్రజలు వేడుకున్నారు. ముఖ్యంగా మిషన్ భగీరథ పైప్‌లైన్ల కోసం తీసిన గుంతలను పూడ్చాలని విజ్ఞప్తి చేశారు. హుజూర్‌నగర్ ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ యాకుబ్‌పాషాతో ఆదివారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను తెలియజేశారు. ప్రధానంగా కుక్కలు, కోతులు, డ్రెయినేజీ, మంచినీటి సరఫరా, ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ, పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరా రు. ప్రజల సమస్యలను ఫోన్ ద్వారా సావధానంగా విన్న కమిషనర్ అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ప్రశ్న : శ్రీనగర్ కాలనీలో హరిబాబు ఇంటి దగ్గర సీసీ రోడ్డు సరిగా లేక అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– ఎస్‌కే రసూల్ మియా, శ్రీనగర్ కాలనీ



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ యాకుబ్ పాషా

కమిషనర్ : మా సిబ్బందిని పంపించి రోడ్లను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : 40 ఏళ్లగా ఎస్‌టీఐ వద్ద ఉంటున్న మా ఇండ్లు కూల్చారు. దానికి పరిహారం ఇవ్వలేదు. అధికారులకు తెలిపినా ఫలితం లేదు. మమ్ములను ఆదుకోవాలి. – ఎస్‌కే ఉద్దండు, హుజూర్‌నగర్

కమిషనర్ : మీరు చెప్పిన సమస్యను నోటుచేసుకున్నాం. ఈ విషయాన్ని తహసీల్దార్, ఆర్డీఓలకు రిపోర్టు పంపుతాం. సమస్యకు పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : జర్మన్ షెఫర్డ్ కుక్కను వీధిలో కట్టేస్తున్నారు. దాని అరుపులకు రాత్రిళ్లు నిద్రకూడా పట్టడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి

– గురుమూర్తి, 7వ వార్డు

కమిషనర్ : మీ ప్రాబ్లమ్‌ను నోట్ చేసుకున్నాం. సంబంధిత కుక్క యజమానితో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూస్తాం.

ప్రశ్న : పట్టణంలోని శాంతిస్థూపం, శ్రీనివాసథియేటర్ ప్రాంతంతో పాటు పాతబస్టాండ్ సమీపంలోని మసీదు వద్ద రోడ్లపై గుంతలు పడి ప్రమాదకరంగా ఉన్నాయి. గుంతలు పూడ్పించండి.

– నరేష్ గౌడ్ అంబళ్ల, కంబాల శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరి, రామిశెట్టి రాంబాబు.

కమిషనర్ : కోర్టు కేసుల వల్ల అక్కడ పనులు ఆగాయి. అయినా రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడ్పిస్తాం. రోడ్డుపైకి నీరు రాకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : మానాన్న గారు చనిపోయి రెండేళ్లు అవుతుంది. పింఛన్ కోసం దరఖాస్తు చేశాము. కార్యాలయంలో అడిగితే పట్టించుకోవడం లేదు.

– పాపారావు, మార్కెట్ యార్డు, సీతారాంనగర్

కమిషనర్ : మున్సిపాలిటీ పరిధిలో పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులను కలెక్టరేట్‌కు పంపాము. మంజూరు కాగానే మీ ఇంటికి వచ్చి తెలియజేస్తాం.

ప్రశ్న : ఎన్‌జీఓస్ కాలనీలో పిట్టల రవి ఇంటి దగ్గర, టీచర్స్ కాలనీలో, గురుకుల కాలేజీ వద్ద డ్రెయినేజీ జామ్ అవుతుంది. దీంతో దుర్గంధం వస్తోంది. చర్యలు తీసుకోవాలి

– ఎండీ బషీర్ అహ్మద్, ఎంఎస్ఎన్ రాజు, సయ్యద్

కమిషనర్ : మా సిబ్బందిని పంపించి తగిన చర్యలు తీసుకుంటా. డ్రెయినేజీ నీరు నిలువ ఉండకుండా చర్యలు చేపడతాం

ప్రశ్న : టీచర్స్ కాలనీకి మిషన్ భగీరథ నీరు రావడం లేదు. ప్రత్యేకంగా బోరు వేసి సమస్యను పరిష్కరించాలి. – ఎంఎస్ఎన్ రాజు, రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్, టీచర్స్ కాలనీ

కమిషనర్ : టీచర్స్ కాలనీకి మిషన్ భగీరథ నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటా. అవసరమైతే ట్యాంకర్ ద్వారా నీటిని పంపిస్తాం.

ప్రశ్న : 3, 16,17, 18 వార్డుల్లో, మట్టపల్లి రోడ్డు, చంద్రం హోటల్ బజారులో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. పిల్లలను, పెద్దలను కరుస్తున్నాయి.

– కంబాల శ్రీనివాస్, ఎస్ శ్రీనివాసరెడ్డి, దేవరం మల్లీశ్వరి, సాయిలక్ష్మణ్

కమిషనర్ : కుక్కలను పట్టి ఊరి బయటకు తరలిస్తాం. వాటి సంతతిని తగ్గించేందుకు వాటికి ఆపరేషన్ చేయిస్తాం.

ప్రశ్న : క్లబ్ వెనుక వీధిలో రోడ్డుపై మిషన్ భగీరథ పైపులు పలిగి 4 నెలలు దాటింది. పట్టించుకునే వారు లేరు. – సుబ్బరాజు, మాజీ వార్డు సభ్యులు

కమిషనర్ : మిషన్ భగీరథ అధికారులకు తెలియజేస్తాం. మా సిబ్బందిని పంపించి పైపునకు జాయింట్ వేయించి సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న : రింగ్‌రోడ్డు పరిస్థితి ఏమిటి సార్

– రామిశెట్టి రాంబాబు

కమిషనర్: ఆర్అండ్‌బీ అధికారులకు తెలియజేసి త్వరలోనే పనులను ప్రారంభించే విధంగా చూస్తాం.

ప్రశ్న : మిషన్ భగీరథ పైపుల కోసం తీసిన గుంతలు పూడ్చక పోవడంతో వాహనాలపై వెళుతున్న వారి వెన్నుపూస దెబ్బతిని అనారోగ్యానికి గురవుతున్నారు. – కంబాల శ్రీపనివాస్, సీపీఐ నాయకులు

కమిషనర్ : మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి ఆ గుంతలను పూడ్పించే విధంగా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : మా ఇంటి పన్ను కట్టమని వస్తున్నారు. మాకు ఇంత వరకు ఇంటి నంబర్ ఇవ్వలేదు. ఇంటి నంబర్ అలాట్ చేయాలి.

– చేపూరి అనంతరాములు, కాకతీయ స్కూల్ వద్ద

కమిషనర్ : మీరు ధ్రువపత్రాల జిరాక్స్‌లతో దరఖాస్తు చేయండి. పరిశీలించి వెంటనే ఇంటి నంబరు కేటాయిస్తాం.

ప్రశ్న : ఎన్నెస్పీ క్యాంప్‌లోని ఫిల్టర్ బెడ్ వద్ద కోతులు ఎక్కువగా ఉంటున్నాయి.

– రమేష్, ఎన్నెస్పీ క్యాంప్

కమిషనర్ : అటవీ అధికారులకు తెలిపి కోతులను పట్టి అడవిలో వదదిలేస్తాం.

ప్రశ్న : 27వ వార్డులో చెత్త బండ్లు రావడం లేదు, సీసీ రోడ్డుకు ర్యాంప్‌లు లేవు.

– నాగరాజు, 27వ వార్డు

కమిషనర్ : కాలనీల్లో చెత్త సేకరణకు ఆటోలు తప్పని సరిగా పంపిస్తాము. ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. రోడ్లను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

క్లుప్తంగా

చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్

తుర్కపల్లి: మండలంలోని దత్తాయపల్లి గ్రామ శివారులో రోడ్డు పనులు నిర్వహించే కార్మికుల గుడిసెల్లో నుంచి రెండు సెల్‌ఫోన్‌లు చోరీ చేసిన దొంగను తుర్కపల్లి పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా యాదారం గ్రామానికి చెందిన టాంగా సత్యనారాయణ షామీర్‌పేట్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ నుంచి బైక్‌ను దొంగతనం చేశాడు. అదే బైక్‌పై పలు గ్రామాలల్లో తిరుగుతూ దొంగతనం చేయడానికి రెక్కీ నిర్వహించాడు. ఈ క్రమంలో దత్తాయపల్లి గ్రామశివారులో ఉన్న కార్మికుల గుడిసెల్లో రెండు సెల్‌ఫోన్‌లు చోరీ చేసి వాటిని తుర్కపల్లి మండల కేంద్రంలో అమ్మడానికి ప్రయత్నిస్తుండగా అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. సత్యనారాయణపై షామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు ఉన్నాయని తెలిపారు.

బాలికల హాస్టల్‌లోకి చొరబడిన వ్యక్తిపై కేసు

హుజూర్‌నగర్: బాలికల వసతి గృహంలోకి చొరబడిన వ్యక్తిపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపులే తెలంగాణ బీసీ సంక్షేమ బాలికల హాస్టల్‌లోకి శనివారం రాత్రి కట్టవారి గూడెం గ్రామానికి చెందిన కీత సాయి చొరబడ్డాడు. వాచ్‌మన్ గమనించి అతడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించాడు. వసతి గృహం టీచర్ మీరాబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటోను ఢీకొన్న లారీ.. నలుగురికి గాయాలు

మఠంపల్లి: ముందు వెళ్తున్న ఆటోను లారీ ఢీకొట్టిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మఠంపల్లి సమీపంలో గల సాగర్ సిమెంట్ పరిశ్రమ మూలమలుపు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెదవీడు గ్రామానికి చెందిన బిచ్చాలు, వెంకటేశ్వర్లు, కాంతారావు, పద్మ పెదవీడులో ఆటో ఎక్కి హుజూర్‌నగర్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో మఠంపల్లి సమీపంలోని సాగర్ సిమెంట్స్ పరిశ్రమ మూలమలుపు వద్ద మట్టపల్లి ప్రధాన రహదారిపై ఆటోను వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఆటో ముందు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న బిచ్చాలుకు ఎడమ కాలు విరగ్గా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు హుజూర్‌నగర్ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు

సూర్యాపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండవ సుదర్శన్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ఈ ర్యాలీ సందర్భంగా అధికారులు, నాయకులు వివరించారు. కార్యక్రమంలో అధికారులు డాక్టర్ పెండెం వెంకటరమణ, బొల్లెపల్లి భాస్కర్‌రాజు, భూతరాజు సైదులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- ట్రాలీ ఆటోలో వెళ్తుండగా ఢీకొట్టిన లారీ
- మరో ఐదుగురికి గాయాలు



ఘటనా స్థలంలో రాంకోటి మృతదేహం

పెద్దవూర: ట్రాలీ ఆటోను లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి మండలంలోని ముసలమ్మచెట్టు స్టేజీ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం లక్‌పతితండా, సత్యంపహాడ్ తండాలకు చెందిన కొందరు ప్రతి వారం మల్లేపల్లి వారాంతపు సంతకు వెళ్లి మేకలు, గొర్రెలను కొని అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో లక్‌పతితండా, సత్యంపహాడ్ తండాలకు చెందిన ఏడుగురు వ్యక్తులు ఆదివారం ఉదయం తండాకు చెందిన ట్రాలీ ఆటోలో కొన్ని గొర్రెలు, మేకలను తీసుకుని మల్లేపల్లి వారాంతపు సంతకు వెళ్లారు. సంతలో పొద్దంతా వ్యాపారాలు చేసి తమ తండాకు అదే ట్రాలీ ఆటోలో తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో మండలంలోని ముసలమ్మచెట్టు గ్రామం స్టేజీ దాటగానే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద వెనక నుంచి వచ్చిన లారీ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడగా, వెనుక కూర్చున్న వారంతా ఒకరిపై ఒకరు పడ్డారు. వారిపై గొర్రెలు, మేకలు సైతం పడ్డాయి. ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చున్న లక్‌పతితండాకు చెందిన ధనావత్ రాంకోటి(75), ట్రాలీలో కూర్చున్న ధనావత్ పస్‌వాలీ(45)లకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. సత్యంపహాడ్ తండాకు చెందిన లావుడి తావు, ఇస్లావత్ మంగ్తా, ధనావత్ సంతోష్, ఆటో డ్రైవర్ ధనావత్ మంగ్తా, లక్‌పతితండాకు చెందిన ధనావత్ వినోద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మృతులు రాంకోటి, పస్‌వాలీల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సాగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని సాగర్ సీఐ కె. నాగరాజు, పెద్దవూర ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ పరిశీలించారు.



ప్రమాదానికి గురైన ఆటో

హుజూర్‌నగర్‌లో మహిళ..



సునీత మృతదేహం

హుజూర్‌నగర్: రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందిన ఘటన ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం అబ్బిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన రావూరి సునీత(33), ఆమె భర్త వెంకటేశ్వర్లుతో కలిసి యాక్టీవాపై కోదాడలోని హాస్టల్‌లో ఉన్న తమ కూతురును చేసేందుకు బయల్దేరారు. మార్గమధ్యలో హుజూర్‌నగర్ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులో గల బజాజ్ షోరూం వద్దకు రాగానే అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో సునీత తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను హుజూర్‌నగర్ ఏరియా హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి భర్త రావూరి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి విద్యార్థి మృతి



మనోహర్ (ఫైల్)

భువనగిరి: ప్రమాదవశాత్తు బావిలో పడి విద్యార్థి మృతిచెందిన ఘటన భువనగిరి పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేట మండలం పాముకుంట గ్రామానికి చెందిన దుపాసి మనోహర్ (19) పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సెలవు దినం కావడంతో మధ్యాహ్నం సమయంలో హాస్టల్‌లో ఉంటున్న ఐదుగురు విద్యార్థులతో కలిసి పట్టణంలోని తారాకరామనగర్ సమీపంలో ఉన్న బావిలో ఈతకు వెళ్లారు. ఇందులో ఇద్దరికి మాత్రమే ఈత రావడంతో వారు బావిలో ఈత పూర్తి చేసుకుని బయటకు వచ్చారు. ఇదే సమయంలో మనోహర్ తన కాళ్లను కడుక్కోవడం కోసం బావిలోకి వెళ్లడంతో ప్రమాదవశాత్తు జారి నీటిలో పడిపోయాడు. వెంటనే తోటి విద్యార్థులు గమనించి కాపాడే ప్రయత్నం చేసినా ఫలించలేదు. వెంటనే విద్యార్థులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ.1.30 లక్షల నగదు, తులంన్నర బంగారం, 6తులాల వెండి అపహరణ

మిర్యాలగూడ అర్బన్: ఇంటి తాళం పగులకొట్టి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్‌లో నివాసముండే దొడ్డ లక్ష్మి స్థానిక నేతాజీ మార్కెట్‌లో కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంది. అయితే గత నెల 27న తన బంధువుల పెళ్లికి కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మి హైదరాబాద్‌కు వెళ్లింది. శనివారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులన్నీ చిందర వందరగా పడేసి ఉన్నాయి. దీంతో వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కాగా బీరువాలో దాచిన రూ.1.30లక్షల నగదు, తులంన్నర బంగారు ఆభరణాలు, 6తులాల వెండి చోరీకి గురైనట్లు బాధితులు లు తెలిపారు. లక్ష్మి కుమారుడు దొడ్డ సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు పేర్కొన్నారు.

నిధులున్నా.. పనులేవీ!

- ఆధిపత్య పోరుతో గ్రామాభివృద్ధికి విఘాతం
- అభివృద్ధికి దూరంగా వీర్లపాలెం



మిర్యాలగూడ : ప్రతిపక్ష, అధికారపక్ష పార్టీల మధ్య ఆధిపత్య పోరుతో గ్రామాభివృద్ధి కుంటుపడుతోంది. నిధులు మంజూరైనా అభివృద్ధికి నోచుకోక ఎక్కడిపనులు అక్కడే వెక్కిరిస్తున్నాయి. ఓ వైపు ఇతర గ్రామాల్లో అభివృద్ధికి నిధుల్లేక సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతుంటే.. నిధులున్నా పనులు చేయలేని పరిస్థితి దామరచర్ల మండలంలోని వీర్లపాలెం గ్రామంలో ఉంది. గ్రామంలో అభివృద్ధి పనులు ప్రారంభించాలని సర్పంచ్ కోర్టును ఆశ్రయించడం గమనార్హం.

2021 డిసెంబర్‌లో నిధులు..

దామరచర్ల మండలంలోని వీర్లపాలెం సమీపంలో టీఎస్ జెన్‌కో సుమారు రూ.30 వేల కోట్లతో 4వేల మెగావాట్ల సామర్థ్యం గల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి చేసిన ప్రతిపాదనతో 2021 డిసెంబర్‌లో వీర్లపాలెం గ్రామాభివృద్ధికి సీఎస్‌ఆర్ (కార్పొరేట్ సామాజిక బాధ్యత) కింద రూ.4.21 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో గ్రామంలో 77 రకాల పనులు చేపట్టేందుకు కలెక్టర్ అనుమతులు ఇచ్చారు. ఏడాది గడిచినా పనులు ప్రారంభానికి నోచుకోలేదు. అదే సమయంలో ఈ పనులకు సంబంధించి టీజెన్‌కో అధికారులు రూ.1.26 కోట్లను కలెక్టర్ ఖాతాలో జమ చేశారు. పనులు ప్రారంభించాల్సిన సమయంలో ప్రతిపక్ష పార్టీకి చెందిన సర్పంచ్‌కు, అధికార పార్టీకి చెందిన నాయకులకు మధ్య విభేదాలు తలెత్తాయి. సర్పంచ్ పనులు చేపట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ గొడవ కాస్తా మంత్రి వద్దకు చేరింది. అటు సర్పంచ్, ఇటు అధికార పార్టీ నాయకుల మధ్య సమన్వయం లేక అది కాస్తా రాజకీయరంగు పులుముకుంది. ఈ పనులపై గ్రామంలో పలుమార్లు వివాదాలు, ఘర్షణలు జరగడంతో పోలీసులు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజకీయ ఆధిపత్యం కారణంగా నిధులు నిష్ఫలమయ్యే పరిస్థితి నెలకొందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

గతంలో మంజూరైన పనులు రద్దు చేస్తూ జీఓ..

పవర్ ప్లాంట్ పరిసర గ్రామాలైన వీర్లపాలెం, తాళ్లవీరప్పగూడెం గ్రామాలల్లో సీఎస్‌ఆర్ కింద పనులు చేపట్టేందుకు ఆగస్టు 2022న రూ.11.94 కోట్లను మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో మంజూరు చేసిన రూ.4.21 కోట్ల పనులను ఈ ప్రొసీడింగ్‌లో చూపించారు. గతంలో మంజూరు చేసిన ఈ పనులను రద్దు చేస్తున్నట్లు జీఓలో పేర్కొనడంతో సర్పంచ్ చల్లా అంజిరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అప్పటి పనుల ప్రారంభంపై వెంటనే ఆదేశాలు జారీ చేయాలని ఈ నెల 6వ తేదీ వరకు కలెక్టర్‌కు కోర్టు గడువు ఇచ్చినట్లు సమాచారం.

సైన్స్ ఫేర్‌తో సృజనాత్మకత పెంపొందుతుంది



ఎగ్జిబిట్లను తిలకిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో అన్నపూర్ణ, శ్రీనివాస్

- రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : సైన్స్ ఫేర్‌తో ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత పెంపొందుతుందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జయ సృష్టి–2023 (సైన్స్ ఫేర్) కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై ఎగ్జిబిట్లను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యం పెంపొందించేందుకు ఇలాంటి సైన్స్ ఫేర్‌లు దోహదపడతాయన్నారు. జయ సృష్టి నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపు, బొమ్మల కొలువు, డెవిల్ హౌస్, హైడ్రాలిక్ మిషన్స్, పీఎస్‌ఎల్‌వీసీ నమూనాలు, నానో ట్యూబ్ తదితర ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టా కిషోర్, పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆదరణే పాలకులకు ఆస్తి



వెల్లంకిలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, సర్పంచ్ మహేందర్‌రెడ్డి తదితరులు



గ్రామ పంచాయతీ భవన నిర్మాణ దాతలను సన్మానిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్

రామన్నపేట : పాలకులకు ప్రజల ఆదరణకు మించిన ఆస్తి మరొకటి ఉండదని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. రామన్నపేట మండలంలోని వెల్లంకిలో సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి తన తాత, నానమ్మలైన వెంకట్‌రెడ్డి – పార్వతమ్మల జ్ఞాపకార్థం సొంత నిధులు రూ.70లక్షలతో నిర్మించిన అధునాతన పంచాయతీ భవనాన్ని ఆదివారం జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. వ్యాపారాలతో ఆస్తులు సంపాదించవచ్చేమో కానీ ప్రజాదరణ పొందలేమన్నారు. ప్రభుత్వం ఇచ్చే నిధులే కాకుండా గ్రామాభివృద్ధికి సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి సొంత డబ్బులు ఖర్చు చేయడం అభినందనీయమన్నారు. అందుకు సహకరిస్తున్న తల్లిదండ్రులు, సహధర్మచారిణి ఆదర్శనీయులని కొనియాడారు. గ్రామస్తులు ఇంటికో పూల మొక్క నాటి ఏడాదిలోగా వెల్లంకిని నందన వనంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. గ్రామంలోని బలహీనవర్గాల కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని పేర్కొన్నారు. సాహితీవేత్త డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య వెల్లంకిలో 2 లక్షల పుస్తకాలతో ఏర్పాటు చేసిన గ్రంథాలయం స్థానిక యువత సన్మార్గంలో ఎదగడానికి దోహదపడుతుందన్నారు. జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడమే కాకుండా గడపగడపకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపొందడంతో పాటు రాష్ట్రంలోనూ మూడవసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణదాతలు ఎడ్ల సుదర్శన్‌రెడ్డి – జయమ్మ దంపతులను సన్మానించారు. సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీపీఓ సునంద, ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి, జెడ్పీటీసీ పున్న లక్ష్మి, నార్మాక్ డైరెక్టర్ మందడి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు ఎర్రోళ్ల లక్ష్మమ్మ, తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, దాశరథీ పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, డీఎల్‌పీఓ సాధన, ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల గ్రామ శాఖ అధ్యక్షులు మందడి ఉదయ్‌రెడ్డి, ఎడ్ల సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్‌చైర్మెన్ ఎన్.భిక్షంరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ కె.శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు కూరెళ్ల నర్సింహాచారి, తాళ్లపల్లి సత్తిరెడ్డి, పున్న నారసింహ, ఉపసర్పంచ్ రవ్వ అనసూయ, వార్డుసభ్యులు రాజలింగం, నాగేష్, జయలక్ష్మి, శాంతి, ఎల్లయ్య, సరిత, కర్ణాకర్‌రెడ్డి, సరిత, సంజీవరెడ్డి, భార్గవి, నరేష్ పంచాయతీ కార్యదర్శి యాదయ్య పాల్గొన్నారు.

బీజేపీ వెంటే పేద, మధ్యతరగతి ప్రజలు



మాట్లాడుతున్న బీజేపీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ధర్మారావు

హుజూర్‌నగర్: పేద, మధ్యతరగతి ప్రజలు బీజేపీ వెంటే ఉన్నారని పార్టీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు అన్నారు. హుజూర్‌నగర్‌లోని వర్తక సంఘం భవనంలో ఆదివారం నిర్వహించిన పోలింగ్ బూత్ స్వశక్తి అభియాన్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు బీజేపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. తెలంగాణ ఏర్పడి తొమ్మిదేళ్లు అయినా రాష్ట్రంలోని పేదలు ఇంకా పేదరికంలోనే మగ్గిపోతున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో దోపిడి వ్యవస్థ, లంచగొండితనం పెరిగిపోయాయని ఆరోపించారు. బీజేపీ బూత్ ఇన్‌చార్జిలు, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్‌లు విజయవంతంగా నిర్వహించారని అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బొబ్బ భాగ్యరెడ్డి, నియోజవర్గ పాలక్ దాసరి మల్లేశం, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు అంబళ్ల నరేష్, జిల్లా ఉపాధ్యక్షుడు బాల వెంకటేశ్వర్లు, జిల్లా అధికార ప్రతినిధులు పత్తిపాటి విజయ్, బాలాజీనాయక్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బల్సుస్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు పోకల వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శిలు తోట శేషు, గుండబోయిన వీరబాబు, నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి, టౌన్ అధ్యక్షులు ఇంటి రవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైక్లింగ్ ఈవెంట్



సైక్లింగ్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థినులు

భువనగిరి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో విద్యార్థినులకు సైక్లింగ్ ఈవెంట్ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు పోటీపడి సైకిళ్లు తొక్కారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శిల్పిని మాట్లాడుతూ.. సైక్లింగ్ చేయడం ద్వారా మహిళలు ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యశోద, సిబ్బంది, సఖి సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FOR SALE

నల్లగొండ ప్రకాశంబజార్‌లో మంచి రన్నింగ్‌లో ఉన్న ప్రముఖ Kids & Men's wear అమ్మకమునకు కలదు. వెంటనే కంటిన్యూగా రన్ చేసుకోవచ్చు. గ్రౌండ్ ఫ్లోర్ + ఫస్ట్ ఫ్లోర్ సంప్ర॥ సెల్ : 9247272429 [Y-1146104]

Services

CONSULTANT

Concord IT Systems INC. Filing H1B for the fiscal year 2023-24, 100% approval rate. Immediate GC processing for deserving consultants. Send your resume at Info@concorditsystems.com +13139693206 / +91 83286 37311 / +91 70954 90108 [H-793342]

Wanted

కోదాడలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కాలేజ్ లో ఆఫీస్ నందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. DTP చేసిన వారికి ప్రాధాన్యత సంప్ర॥ సెల్ : 8978973332 [Y-784321]

ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781924]

లేపాక్షి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషేంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీ: 20K. ఏజెంట్ కమీషన్ 5K. Ph: 9640300074 [HA-1047]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రెండు తలల దూడ జననం



చింతపల్లి : మండల పరిధి లోని గడియగౌరారం గ్రామానికి చెందిన వరికుప్పల వెంకట్రాములు ఆవు ఆదివారం రెండు తలల దూడకు జన్మించింది. ఈ వింతను చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

విరాట్‌సేన ఆధ్వర్యంలో పురోహిత పురస్కారాలు




ఆనందాచార్యులుకు పురస్కారం అందజేస్తున్న విరాట్‌సేన ప్రతినిధులు

చౌటుప్పల్: విరాట్ సేన (విశ్వ బ్రాహ్మణ సేవా సంస్థ) ఆధ్వర్యంలో పురోహిత పురస్కారాలు–2023 కార్యక్రమాన్ని ఆదివారం పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయ నిర్మాణ స్థపతి డాక్టర్ డాక్టర్ వేలు ఆనందాచార్యులుకు శిల్పకళా సామ్రాట్ బిరుదు, రాచకొండ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ కౌన్సిలర్లు పోలోజు వనజఅనిల్‌కుమార్, పోలోజు శ్రీధర్‌బాబులు ఆనందాచార్యులు సన్మానించారు. కార్యక్రమంలో విరాట్‌సేన ప్రతినిధులు రాచకొండ వేణుకుమారాచార్యులు, చౌదరిమెట్టు శ్రీనివాసాచార్యులు, రాచకొండ భాస్కరాచార్యులు, కాసోజు శ్రీనివాసాచార్యులు, కాసోజు శివానందాచార్యులు, అమరేంద్రచార్యులు, హరికృష్ణాచార్యులు, పులిగిల్ల అచ్యుత ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి పూత రాలకుండా జాగ్రత్తలు పాటించాలి

- హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్



నడిగూడెం: మామిడి దిగుబడికి పూత, పిందె ప్రధానం. ఉమ్మడి జిల్లాలో దాదాపు 10వేల హెక్టార్లకు పైగా మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఈ ఏడాది కొంచెం ఆలస్యంగా పూత వచ్చింది. పూత రాలే సమయంలోనే తగు జాగ్రత్తలు పాటిస్తే కాత బాగా వస్తుందని, దీంతో రైతులు నష్టపోకుండా అధిక దిగుబడి సాధించవచ్చని ప్రముఖ హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్ చెబుతున్నారు. మామిడి పూత రాలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

వాతావరణ మార్పులతో నష్టం..

వాతావరణ మార్పులతో ఉమ్మడి జిల్లాలో ఆరేళ్లుగా మామిడి రైతులు నష్టపోతున్నారు. పూత వచ్చిన సమయానికి వర్షాలు కురిస్తే పూత రాలిపోతుంది. దీనికి తోడు చలి, మంచు పెరగడంతో మొగ్గలు సరిగా విచ్చుకోవడం లేదు. పూత ఆలస్యంగా రావడం పిందె కట్టకపోవడం వలన మామిడి సకాలంలో కోతకు రావడం లేదు. వాతావరణ ప్రభావాన్ని అధిగమించడానికి రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాల్సి ఉంటుంది.



పూత దశలో ఉన్న మామిడి తోట



సుందరి సురేష్, హార్టికల్చర్ కన్సల్టెంట్

- **బూడిద తెగులు :** ఈ తెగులు ఆకులు, పూరెమ్మల మీద ఆశించినప్పుడు బూడిద లాంటి తెల్లని పదార్థం వ్యాపించి పూత, పిందె మాడి రాలిపోతుంది. 10 నుంచి 15డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత, 33 నుంచి 37డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు ఉండే జనవరి నుంచి మార్చి మొదటి వారం వరకు ఈ తెగులు ఆశించే అవకాశముంది.
- **నివారణ చర్యలు :** బూడిద తెగులు మామిడి పూతను ఆశించకుండా ముందు జాగ్రత్త చర్యగా జనవరి తర్వాత నుంచి గంధకం 3గ్రాములు లీటరు నీటికి కలిపి చెట్టు మొత్తం పూర్తిగా తడిసేలా పిచికారీ చేయాలి. మామిడి పూత మొత్తం విచ్చుకున్న తర్వాత నీటి తడులు ఇచ్చిన వారం రోజుల తర్వాత హెక్సాకోనాజోల్ 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. 10 సంవత్సరాలు నిండిన మామిడి చెట్టుకు కనీసం 8లీటర్లు మందు పిచికారీ చేయాలి. రైతులు తప్పనిసరిగా శాస్త్రవేత్తలు లేదా అధికారులు సిఫారసు చేసిన పురుగు లేదా తెగులు మందును తగిన మోతాదులో వాడాలి.